బయోడైవర్సిటీ నుంచి గచ్చిబౌలికి వెళ్లే మార్గంలో వర్షంతో భారీగా నిలిచిపోయిన వాహనాలు

హైటెక్ సిటీ రోడ్డులో భారీగా నిలిచిపోయిన వాహనాలు

సుచిత్ర చౌరస్తాలో దంచికొడుతున్న వర్షం

జోరు వాన.. జలమయమైన రోడ్లు

- పలు ప్రాంతాల్లో విరిగిపడిన చెట్ల కొమ్మలు.. విద్యుత్ స్తంభాలు..
- స్తంభించిన ట్రాఫిక్.. లోతట్టు ప్రాంతాలు జలమయం
- లోతట్టు ప్రాంతాల్లోపరిశీలించిన జడ్సీ అభిలాష, అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ/మాదాపూర్, మే 16: మండు వేసవిలో కురిసిన భారీ వర్షంతో ప్రజలు కాసింత ఉపశమనం పొందారు. గత రెండు నెలలుగా పెరిగిన ఎండవేడిమి... ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం రాకతో కాస్త సంతోషపడుతున్నారు. గురువారం కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో కురిసిన జోరువానతో కాలనీలు, బస్తీలు జలమయం కాగా, లోతట్టు ప్రాంతాల్లో నీరునిలిపోయింది. కేపీహెచ్‌బీ కాలనీ, మూసాపేట పరిసర ప్రాంతాల్లో కొన్నిచోట్ల చెట్లు కూలిపోయాయి. ఏకధాటిగా సుమారు గంటకుపైగా కురిసిన వర్షంతో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లన్నీ వాగులను తలపించాయి. ఉద్యోగస్థులు, వివిధ పనులు చేసుకోవడానికి రోడ్డుపైకి వచ్చిన ప్రజలంతా తడిసిముద్దయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో జీహెచ్ఎంసీ అత్యావసర బృందాలు రంగంలోకి దిగి నీటిని క్లియర్ చేశారు.

ముంపు సమస్య లేకుండా చర్యలు:జడ్సీ

వర్షంనీటితో ముంపు సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ కమిషనర్ అభిలాష అన్నారు. గురువారం మూసాపేట సర్కిల్‌లోని దీన్‌దయాల్‌నగర్ నాలా, వైజంక్షన్ సమీపంలోని మెట్రోస్టేషన్ కింద వర్షం నీటి ముంపు ప్రాంతాలను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. జోన్‌లోని ఐదు సర్కిళ్ల పరిధిలో వర్షం నీటి ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడైనా ముంపు సమస్యలు ఏర్పడితే అత్యావసర బృందాలు చేరుకుని తక్షణ సహాయక చర్యలు అందిస్తాయన్నారు. ముంపు సమస్యలపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ సత్యనారాయణ, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, డీఈ శ్రీదేవి, ఏఈలు, ఇతర విభాగాల అధికారులు ఉన్నారు.

హైటెక్‌సిటీలో...

కొండాపూర్, మే 16 : హైటెక్‌సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఒక్కసారిగా దంచికొట్టిన వానతో రోడ్లన్ని జలమయమయ్యాయి. పలు చోట్లలో రోడ్లపై వరద నీరు చేరడంతో అటుగా రాకపోకలు చేసే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. దుర్గంచెరువు పెట్రోల్ బంక్ సమీపంలోని కూడలిలో వరద నీరు పోటెత్తడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కాగా, ఏఐజీ దవాఖాన, కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం, మాదాపూర్ బాటా షోరూమ్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులతోపాటు జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి వరదనీటిని తొలగించారు.

కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్, మే 16 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వ్యాప్తంగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోయింది. ప్రధాన రోడ్లపై అర్ధగంటకు పైగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

హైటెక్‌సిటీలోని పలు ప్రాంతాల్లో జలమయమైన రోడ్లు

మూసాపేట సర్కిల్‌లో లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరద నీటిని పరిశీలిస్తున్న జడ్సీ అభిలాష, అధికారులు

కూకట్‌పల్లి సర్కిల్‌లో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న డీసీ కృష్ణయ్య, ఈఈ గోవర్ధన్ తదితరులు

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్‌లో సహాయక చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసీ మాన్‌సూన్ సిబ్బంది

కూకట్‌పల్లి సర్కిల్‌లో రోడ్లపై నిలిచిన నీటిని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది


కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో విద్యుత్ తీగలపై విరిగి పడిన చెట్లకొమ్మలు

డెంగీపై అవగాహన పెంపొందించుకోవాలి

శేరిలింగంపల్లి వైద్యాధికారి చందర్

శేరిలింగంపల్లిలో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

శేరిలింగంపల్లి, మే 16 : డెంగీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించి వారిని చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చందర్ అన్నారు. డెంగీ అవగాహన వారోత్సవాల్లో భాగంగా జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి శేరిలింగంపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. శేరిలింగంపల్లి పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైన ర్యాలీ లింగంపల్లి రైల్వే స్టేషన్, గుల్‌మొహర్‌పార్క్ కాలనీల మీదుగా చందానగర్ పీజేఆర్ స్టేడియం వరకు నిర్వహించారు. కార్యక్రమానికి పీహెచ్‌సీ డాక్టర్ చందర్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి స్వామి, జీహెచ్ఎంసీ ఎంటమాలజిస్టు కిరణ్, శ్యామల, సత్యనారాయణరెడ్డిలతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం

రామకృష్ణ

దుండిగల్,మే 16: ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన కొత్తపల్లి భారతి, వెంకటస్వామి దంపతుల చిన్న కొడుకు కొత్తపల్లి రామకృష్ణ(37)గతమూడు నెలల కిందట ఉపాధి కోసం నగరానికి వచ్చి కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాశ్‌నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలోని 60/25 ఫ్లాట్‌లో నివాసముంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. వచ్చిన వారం పదిరోజులపాటు తల్లిదండ్రులతో ఫోన్‌లో బాగానే మాట్లాడేవాడు. ఆ తర్వాత నుంచి రామకృష్ణ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో అనుమానించిన అతడి తల్లి భారతి సూరారంకాలనీలోని రామకృష్ణ నివాసముంటున్న ఫ్లాట్‌కు వచ్చి పరిశీలించగా.. తాళం వేసి ఉన్నది. చుట్టు పక్కల వారిని విచారించినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొంపల్లి ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో..

వీడని వీధి కుక్కల దాడులు

- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- ఇప్పటికే 50 మందికి పైగా కుక్కకాటు బాధితులు
- తాజాగా మరో మహిళ పై దాడి

వీధికుక్కల దాడిలో గాయపడిన సరిత

కుత్బుల్లాపూర్, మే 16: ఒకటి కాదు రెండు అంతకంటే కాదు.. ఏకంగా 50 మందికిపైగా బాధితులు ఆ ఒక్క కాలనీలోనే ఉన్నారు. వెంటాడి మరీ దాడి చేస్తూ వీధికుక్కలు ఆ కాలనీలో స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఏకంగా ఇంట్లోకి వచ్చి మరీ దాడి చేస్తున్నండటంతో ఆ కాలనీ ప్రజలంతా వీధి కుక్కలంటేనే భయపడే పరిస్థితి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో నెలకొన్నది. తాజాగా అదే కాలనీకి చెందిన ఓ గృహిణి సరిత(31) తన ఇంటి గేటు ముందు నిలబడి ఉన్నది. దీంతో వీధికుక్క లోపలికి వచ్చి కాలుకు కాటువేసి పారిపోయింది. దీంతో ఆమె గత ఫిబ్రవరి 4వ తేదీన తన పాప తన్విహపై వీధి కుక్క దాడి చేసింది. ఇలా వరుసగా 50 మందికిపైగా దాడులు చేసి గాయపర్చడంతో ఆ కాలనీ ప్రజలంతా ఇప్పుడు నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సంబంధిత కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు దాడులు జరిగినప్పుడే అడపాదడపాగా తగు చర్యలు తీసుకోవడంతో సమస్య మొదటికి చేరుతుందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదటగా ఇక్కడ వీధికుక్కల పునరుత్పత్తి జరగకుండా తీసుకోవాల్సిన చర్యల కోసం చారి అనే వ్యక్తికి కాంట్రాక్ట్ ఇచ్చిన అధికారులు.. సదరు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన బిల్లులో లక్షలకుపైగా పెండింగ్‌లో ఉండడంతో ఇక్కడి కాంట్రాక్ట్‌ను వదులుకున్నాడు. ఆ తర్వాత బ్లూక్రాస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని సంస్థకు సైతం లక్షల్లో పెండింగ్‌లో పెట్టడంతో ఆ సంస్థ నిర్వాహకులు సైతం ఇక్కడికి రావడానికి ఆసక్తిని కనబర్చడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనేకసార్లు కాలనీలో వీధికుక్కల నుంచి విముక్తి కల్పించాలని ఆందోళనలు, ధర్నాలు చేశామని, సంబంధిత మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా తమ కాలనీలో సమస్య అలాగే ఉందని కాలనీ అసోసియేషన్ నిర్వాహకులు శివాజీరాజు తెలిపారు. ఇప్పటికైనా తమ కాలనీలో వీధికుక్కల దాడి నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కాలనీవాసులంతా ఏకమై ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 16 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 21, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 18, దొండ 33, చిక్కుడు 65, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలుగడ్డ 32, కీరా 18, దోసకాయ 18, సొరకాయ11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 70, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 22, చింతకాయ -, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 7 నుంచి 8, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 65 నుంచి 75, మునగకాయ(1) 4 నుంచి 5, పచ్చి బఠాని -, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80 గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

దుండిగల్, మే 16: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) పరిధి, 32వ డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్)అన్నారు. 32వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డితోపాటు పలువురు నేతలు, బస్తీవాసులు గురువారం కేఎస్ఆర్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి పైప్‌లైన్, నీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించారు. అదే విధంగా 31వ డివిజన్‌కు చెందిన అరుణతో పాటు ప్రగతినగర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కేఎస్ఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

బోయిన్ చెరువు నిండా గుర్రపు డెక్క

అధికారుల నిర్లక్ష్యంతో దుర్గంధం వెదజల్లుతున్న చెరువు

బాలానగర్, మే 16:ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి హస్మత్‌పేట బోయిన్ చెరువు నిండా గుర్రపు డెక్క వ్యాప్తి చెందింది. సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. గుర్రపు డెక్కను తొలగించడానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుర్రపు డెక్క కారణంగా దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెరువులో ఓ వైపు కలుషిత జలాలు వచ్చి చేరుతుండటం.. మరోవైపు గుర్రపు డెక్క పెరుగుతుండటంతో మరింతగా దుర్వాసన పెరుగుతుందని, తద్వారా దోమలు కూడా అదే స్థాయిలో వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాబోయేది వర్షాకాలం కారణంగా దోమలు రెట్టింపు స్థాయిలో పెరిగే అవకాశాలు ఉంటాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సకాలంలో గుర్రపుడెక్కను తొలగించి చెరువు పరిసరాలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


హస్మత్‌పేట బోయిన్ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

అంతా కలిసి ఆట నేర్చుకుందాం..

జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంప్‌కు విశేష స్పందన

కేపీహెచ్‌బీ కాలనీలో కోచ్ అంజిబాబు పర్యవేక్షణలో బాస్కెట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 16:జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరాలకు మంచి స్పందన లభిస్తున్నది. ఏడాది కాలంపాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు వేసవి సెలవుల్లో నచ్చిన క్రీడల్లో మెలుకువలు నేర్చుకుంటూ ఆనందాన్ని పొందుతున్నారు. ఉదయాన్నే క్రీడా ప్రాంగణానికి చేరుకుని తోటి విద్యార్థులతో కలిసి ఆటలతో మైమరిచిపోతున్నారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్లలో 29 క్రీడా కేంద్రాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో రెండు వేలకు పైగా విద్యార్థులు వివిధ క్రీడల్లో నైపుణ్యాలను పొందుతున్నారు. గతంలో వేసవి శిక్షణా శిబిరాల్లో పాల్గొన్న వారితోపాటు కొత్తవారు సైతం శిబిరాల్లో పాల్గొంటూ సందడి చేస్తున్నారు.

సందడిగా శిబిరాలు

కేపీహెచ్‌బీ కాలనీలోని వేసవి శిక్షణా శిబిరాల్లో సందడి నెలకొన్నది. వేసవి శిక్షణా శిబిరాల్లో బాల్ బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కరాటే, బాక్సింగ్, క్యారమ్స్, క్రికెట్, చెస్, రోలర్ స్కేటింగ్, షటిల్ బ్యాడ్మింటన్, పుట్‌బాల్, టెన్నిస్, ఖోఖో, యోగా, టెన్నీకాయిట్, త్వైక్వాండో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. నైపుణ్యం కలిగిన కోచ్‌ల పర్యవేక్షణలో ఎంచుకున్న క్రీడా అంశాల్లో నైపుణ్యాలు, మెలకువలు, సూచనలు అందిస్తున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో రమ్యా ప్లేగ్రౌండ్‌లో బాల్‌బాడ్మింటన్, కాలనీ 7వ ఫేజ్‌లో బాస్కెట్‌బాల్, క్రికెట్, బతుకమ్మకుంట పార్కులో రోలర్ స్కేటింగ్, కేపీహెచ్‌బీ కాలనీ 3, 5, 7వ ఫేజ్‌ల్లోని క్రీడా ప్రాంగణాల్లో షటిల్ బ్యాడ్మింటన్, కాలనీ 7వ ఫేజ్, ఆంజనేయనగర్‌లలో టెన్నిస్, మోతీనగర్, కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లో తైక్వాండో, భరత్‌నగర్ కాలనీ, కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో వాలీబాల్ శిక్షణా తరగతులకు మంచి స్పందన లభిస్తుంది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు విద్యార్థులు క్రీడా ప్రాంగణాలకు చేరుకుని కోచ్‌ల వద్ద నైపుణ్యాలను నేర్చుకుంటున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో కోచ్ అంజిబాబు పర్యవేక్షణలో.. మైదానంలో విద్యార్థులు బాస్కెట్‌బాల్‌తో పాటు టెన్నిస్, వాలీబాల్, షటిల్, కబడ్డీ క్రీడల్లో నైపుణ్యాలు నేర్చుకుంటున్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ చేశాం..

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరాలకు ఈ ఏడాది 2వేల మంది విద్యార్థులకుపైగా నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. నైపుణ్యం కలిగిన కోచ్‌ల పర్యవేక్షణలో ఆయా క్రీడా అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. క్రీడలకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశాం. విద్యార్థులు సంతోషంగా సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్నారు. విద్యార్థులలో నైపుణ్యాలను గుర్తించడానికి క్యాంప్‌లు ఉపయోగపడుతాయి. ఈనెల 31 వరకు సమ్మర్ క్యాంప్ కొనసాగుతుంది. – *వీరానంద్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి, కూకట్‌పల్లి జోన్*

నిరంతరంగా కోచింగ్..

క్రీడలపై మక్కువతో కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్, వాలీబాగ్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడా ప్రాంగణాలను జీహెచ్ఎంసీ సహకారంతో ఏర్పాటు చేశాను. రోజూ విద్యార్థులు, యువకులకు కోచింగ్ ఇస్తున్నా. వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా కాలనీలోని విద్యార్థులు నచ్చిన కీడాంశాల్లో నైపుణ్యాలతోపాటు మానసిక ఆనందాన్ని పొందుతున్నారు. ఈ గ్రౌండ్‌లో సాధన చేసిన కొందరు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. విద్యార్థులు కోచ్‌ల నైపుణ్యాలు పొందడం సంతోషంగా ఉన్నది. – *బసవి అంజిబాబు, బాస్కెట్‌బాల్ కోచ్, కేపీహెచ్‌బీ కాలనీ*

రోడ్డుపైనే చెత్త డంప్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చు. అలా ఉండాలంటే ప్రతిరోజు ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలోనే చెత్తను వేయాలి. కానీ కొందరు బాధ్యత మరిచి రోడ్లపైనే చెత్త వేస్తున్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌ను ఆనుకుని ఉన్న గోడ వెంబడి రోడ్డుపై ఇష్టానుసారంగా చెత్తపడేస్తున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లి అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నది. ఈ చెత్త వద్దకు పశువులు, కుక్కలు రావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. ఈ ప్రాంతంలో అధికారులు చర్యలు తీసుకోవడంతోపాటు పేరుకుపోయిన చెత్తను తొలగిచాలని స్థానికులు కోరుతున్నారు. – *అల్లాపూర్, మే 16*